క్లుప్తంగా

ప్రభుత్వ పథకాలపై ప్రచారం

కోటబొమ్మాళి: బంజరుపేట, సీతన్నపేట గ్రామాల్లో మండల వైఎస్సార్‌సీపీ కన్వీనర్ నూక సత్యరాజ్, జేసీఎస్ ఇన్‌చార్జి జి.నాగభూషణరావు ఆధ్వర్యంలో గృహసారథులు శనివారం ప్రభుత్వ పథకాలపై ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి వారికి అందుతున్న రాయితీల గురించి వివరించారు. కార్యక్రమంలో సర్పంచ్ కాళ్ల సంజీవరావు, ఎంఎల్‌వో తారకేశ్వరరావు, బమ్మిడి శ్రీనివాస్, ఇర్రి చిరంజీవి ఉన్నారు.

అభివృద్ధి పనులకు ప్రాధాన్యం

కంచిలి: గ్రామాల్లో అభివృద్ధి పనులు చేపట్టడానికి వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని ఎంపీపీ పైల దేవదాస్ రెడ్డి అన్నారు. పురుషోత్తపురం సచివాలయం పరిధి ఎస్.ఆర్.సి.పురం పంచాయతీ కేంద్రంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'నిధులు రూ. 2.1 లక్షల అంచనా వ్యయంతో చేపట్టనున్న 40 మీటర్ల సిమెంటు రోడ్డు నిర్మాణ పనులకు శనివారం భూమి పూజ చేశారు. జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, పీఏసీఎస్ అధ్యక్షుడు గుమ్మడి రామదాసు, స్థానిక సర్పంచ్ డొక్కరి తులసి, నాయకుడు బలరాం, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డు కేశవపాత్రో, మండల జేసీఎస్ కన్వీనర్ కొణపల సురేష్, ఏఎంసీ డైరెక్టర్ డొక్కరి దాలయ్య, కొల్లి మల్లేశ్ పాల్గొన్నారు.

అలరించిన గాత్ర కచేరి

ఇచ్ఛాపురం రూరల్: బొడ్డఖాళీ గ్రామంలో వెలసిన కల్యాణ వెంకటేశ్వర స్వామి ఆలయం కార్తీక శనివారం సందర్భంగా భక్తులతో రద్దీగా మారింది. ఈ సందర్భంగా ఆలయ కళ్యాణ మండపం వద్ద నిర్వహించిన గాత్ర కచేరీ భక్తులను అలరించింది. గాయనీమణులు కొత్త లావణ్య, లక్కోజి జీవిత, డబ్బూరు లక్ష్మి, బడకల జయలక్ష్మిలు వెంకటేశ్వరుని భక్తి గీతాలతో భక్తుల్లో పారవశ్యం నింపారు.

గణితమంటే భయం వద్దు

కోటబొమ్మాళి: విద్యార్థులు గణితంపై భయం వీడి మక్కువ పెంచుకోవాలని కోటబొమ్మాళి ఎంఈవో-1 ఎస్.అప్పలరాజు, బాలుర హైస్కూల్ హెచ్ఎం డబ్బిరు గోవిందరావు సూచించారు. హైస్కూల్ ఆవరణలో ఆరు నుంచి పది తరగతుల విద్యార్థులకు గణితంపై అవగాహనా కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఆసక్తితో చదివితే లెక్కల్లో రాణించవచ్చునన్నారు. గణితంలో, రాణిస్తున్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు. ఉపాధ్యాయులు ఎస్.సంజీవరావు, ఎం.వేణు, శేషాచలం, సోమశేఖర్‌రావు పాల్గొన్నారు.

బాల్య వివాహాలపై చైతన్య పరచండి

నందిగాం: బాల్య వివాహాలు చేయడం వల్ల కలిగే నష్టాలను వివరించి ప్రజలను చైతన్య పరచాలని ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి అన్నారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో బాల్య వివాహాల నియంత్రణపై ఐసీడీఎస్ అధికారుల ఆధ్వర్యంలో శనివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. బాల్య వివాహాలతో అమ్మాయిల్లో చోటుచేసుకోనున్న శారీరక, మానసిక రుగ్మతలపై అవగాహన కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఎంపీడీవో శివప్రసాద్, తహసీల్దారు వై.పద్మావతి, ఎంఈవో జి.నర్సింహులు, జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ కౌన్సిలర్ డి.సీతారాం, చైల్డ్‌లైన్ సభ్యులు మల్లేశ్వరరావు, శివాజీ, సునీత, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు జలజాక్షి, శారద పాల్గొన్నారు.

విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

టెక్కలి రూరల్: పెద్దసాన ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబరిచినట్లు ప్రధానోపాధ్యాయుడు బోడ్డేపల్లి నేతాజీ శనివారం తెలిపారు. ఈ నెల 15వ తేదీన గుంటూరులో జరిగిన పోటీల్లో పాఠశాలకు చెందిన గరికిపేట ధనుష్క బంగారు, దుబ్బక హరికృష్ణ కాంస్య పతకం సాధించి ఢిల్లీలో జరగనున్న జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. విద్యార్థులను ఉపాధ్యాయులతో పాటు కోచ్ జగదీశ్వరరావు అభినందించారు.

కరువు జిల్లాగా ప్రకటించాలి

పలాస: శ్రీకాకుళం జిల్లాను కరువు ప్రాంతంగా ప్రకటించాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకుడు గొరకల బాలక్రిష్ణ కోరారు. బొడ్డపాడులో జిల్లా అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలని కోరుతూ ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు ఉద్దానం ప్రాంతంలో శనివారం పర్యటించి కరపత్రాలను పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు. అమరవీరుల స్మారక మందిరం వద్ద మాట్లాడుతూ.. మర్రిపాడులో ఈనెల 22న నిర్వహించనున్న జిల్లా అమరవీరుల స్మారక సభను విజయవంతం చేయాలన్నారు. న్యూడెమోక్రసీ పార్టీ నాయకులు పోతనపల్లి కుసుమ, కుత్తుం హేమావతి, జడ్డే అప్పయ్య, కర్రి అప్పారావు ఢిల్లీరావు పాల్గొన్నారు.

బీజేపీ పలాస ఇన్‌చార్జిగా నామనందస్వామి

కాశీబుగ్గ: బీజేపీ పలాస నియోజకవర్గ ఇన్‌చార్జిగా రామానందస్వామి నియమితులయ్యారు.ఈ సందర్భంగా పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో పార్టీ శ్రేణులు ఆయన్ని అభినందించారు.

అభివృద్ధి ప్రదాత సీఎం జగన్

అభివృద్ధి ప్రదాత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అని ప్రజాప్రతినిధులు, అధికారులు అన్నారు. 'వై ఏపీ నీడ్స్ జగన్' కార్యక్రమం టెక్కలి, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల్లోని పలు గ్రామాల్లో శనివారం జరిగింది. ఈ సందర్భంగా వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షమ పథకాలపై మాట్లాడారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను ప్రజలను అందిస్తున్న సీఎం జగన్ రాష్ట్రానికి ఎంతో అవసరమన్నారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల వివరాలతో కూడిన డిస్‌ప్లే బోర్డులను ఆవిష్కరించారు.



టెక్కలి: తొలుసూరుపల్లిలో కార్యక్రమం నిర్వహిస్తున్న జేసీఎస్ ఇన్‌చార్జి మోహన్, తదితరులు



కొర్లాం గ్రామంలో ఇంటింటా ప్రచారం నిర్వహిస్తున్న ఎంపీపీ నిమ్మన దాస్



కవిటి: బెజ్జిపుట్టుగలో ఇంటింటి ప్రచారంలో పార్టీ నాయకులు కడియాల ప్రకాష్, యుగంధర్

అభివృద్ధే సీఎం జగన్ ధ్యేయం

- టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి
- రేగులపాడులో 'గడప గడపకు మన ప్రభుత్వం'



సంక్షేమాన్ని వివరిస్తున్న దువ్వాడ వాణి

కోటబొమ్మాళి: ప్రతి కుటుంబం అభివృద్ధి చెందేలా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలను వర్తింపజేస్తున్నారని వైఎస్సార్‌సీపీ టెక్కలి సమన్వయకర్త దువ్వాడ వాణి అన్నారు. రేగులపాడు గ్రామంలో 'గడప గడపకు మన ప్రభుత్వం'కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి నాలుగున్నరేళ్లలో సమకూరిన సంక్షేమాన్ని వివరించారు. పీఏసీఎస్ అధ్యక్షుడు బాడాన మురళి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ నూక సత్యరాజ్, వెలమ కార్పొరేషన్ డైరెక్టర్ దుంగ శిమ్మన్న, జేసీఎస్ మండల ఇన్‌చార్జి గెడ్డవలస నాగభూషణరావు, జేసీఎస్ కన్వీనర్లు బమ్మిడి శ్రీనివాస్, ఎస్.నారాయణ రావు, సర్పంచ్ పేడాడ విలాస్, పంగ చందర రావు, సుంకరి జనార్దనరావు తదితరులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఓటరు దరఖాస్తుల పరిశీలన

- డీఆర్వో గణపతి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో గణపతి

ఇచ్ఛాపురం రూరల్: ఇప్పటి వరకు చేపట్టిన ఓటరు నమోదు, సవరణలు, తొలగింపులు, ఆధార్ అనుసంధానం వంటి అంశాలతో కూడిన దరఖాస్తులను తహసీల్దార్లు, ఎన్నికల డీటీలు, బీఎల్‌వోలు క్షేత్రస్థాయిలో పరిశీలించాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎం.గణపతి అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట మండలాలతో పాటు ఇచ్ఛాపురం మున్సిపాలిటీలోని తహసీల్దార్‌లు, రెవెన్యూ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్లు, బీఎల్‌వోలతో ఓటరు నమోదు ప్రక్రియపై శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఓటరు నమోదుకు వచ్చిన కొత్త దరఖాస్తులను బీఎల్‌వోల ద్వారా క్షేత్రస్థాయిలో పరిశీలించి ఆమోదించాలన్నారు. మరణించిన వారి పేర్లను ముందుగా నోటీస్ ఇచ్చి డెత్ సర్టిఫికెట్ తీసుకున్న తరువాత తొలగించాలన్నారు. నియోజకవర్గంలో యువత ఓటరు నమోదుకు పెద్దగా ఆసక్తి చూపడం లేదన్నారు. 18 ఏళ్లు దాటిన ప్రతి ఒక్కరిచేత ఓటుకు దరఖాస్తు చేసుకునేలా గ్రామ స్థాయిలో అవగాహన కల్పించాలన్నారు. డిసెంబర్ నెలాఖరు వరకు దరఖాస్తులను నేరుగా తహసీల్దార్ కార్యాలయానికి, లేక బీఎల్‌వోలకు సమర్పించవచ్చన్నారు. ప్రతీ బూత్‌లో బీఎల్‌వోల్లాగ ప్రధాన రాజకీయ పార్టీలకు సంబంధించి నాయకులను 'బీఎల్ఏ'లుగా నియమించడం జరుగుతుందన్నారు. ఈ సందర్భంగా బీఎల్‌వోలు నిర్వహిస్తున్న రిజిస్టర్లు, కొత్తగా ఓటరు నమోదుకు చేసుకున్న దరఖాస్తులు, డూప్లికేట్ ఓట్లను, తొలగింపు వివరాలను పరిశీలించారు. సమావేశంలో ఎన్నికల ఉప తహసీల్దార్ బి.శ్రీహరి, ఇచ్ఛాపురం, కవిటి, కంచిలి, సోంపేట తహసీల్దార్‌లు సదాశివుని గురుప్రసాద్, పి.శేఖర్, ఎస్.హైమావతి, బి.శివశంకర్ సత్యన్నారాయణ, గ్రామ సచివాలయ సిబ్బంది, వీఆర్వోలు పాల్గొన్నారు.

క్రీడా పరికరాలు వితరణ

పలాస:

బొడ్డపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన గ్రిగ్స్ క్రీడాకారులకు అదే పాఠశాలకు చెందిన స్కూలు అసిస్టెంటు ఎస్.ఎస్.మంగరాజు బ్యాడ్మింటన్ రాకెట్స్, నెట్ తదితర క్రీడా సామగ్రిని శనివారం వితరణ చేశారు. ప్రధానోపాధ్యాయులు ఎ.వీర్రాజు, పీడీ సీహెచ్ రామ్‌జీ ఉన్నారు.



క్రీడాకారులతో ఉపాధ్యాయులు

'బంగారు శిరీష'

కాశీబుగ్గ: గోవాలో ఇటీవల జరిగిన జాతీయస్థాయి గేమ్స్ అండ్ స్పోర్ట్సులో పలాస ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎం.శిరీష బంగారు పతకం సాధించింది. 1600 మీటర్ల రిలే పరుగు పందెంలో పతకాన్ని సాధించినట్టు ప్రిన్సిపాల్ టి.గోవిందమ్మ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా శిరీషాను అభినందించారు. ఫిజికల్ డైరెక్టర్ డాక్టర్ పి.మధు ఉన్నారు.



బంగారు పతకం సాధించిన శిరీష

ముగిసిన ఆలయ ప్రతిష్ట మహోత్సవాలు

కంచిలి: బెల్లుపడ గ్రామంలో పునర్ నిర్మించిన రాధాకృష్ణ ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు శనివారంతో ముగిశాయి. మూడు రోజులుగా పూజా కార్యక్రమాలు చేపట్టారు. చివరి రోజున యంత్ర, శిఖర, ధ్వజ స్తంభంతోపాటు విగ్రహాల ప్రతిష్ట చేపట్టారు. కేరళ కళాకారులు భజనలు చేశారు. సాయంత్రం ఒడిశా కళాకారులతో ప్రహ్లాద నాటకాన్ని ప్రదర్శించారు. స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశోక్, స్థానిక ఎంపీపీపైల దేవదాస్‌రెడ్డి, జెడ్పీటీసీ సభ్యురాలు ఇప్పిలి లోలాక్షి, నాయకలుకృష్ణారావు, వజ్జ మృత్యుంజయరావు పాల్గొన్నారు.



పూజల్లో ఎంపీపీ దేవదాస్‌రెడ్డి తదితరులు

కరవు పరిస్థితులపై సమీక్ష

కంచిలి: మండలంలో ఏర్పడిన కరవు పరిస్థితులపై వ్యవసాయశాఖ యంత్రాంగంతో ఎంపీపీ పైల దేవదాస్‌రెడ్డి స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం సమీక్షించారు. మండలంలో 5,688 ఎకరాల్లో వరి పంటను వేయగా.. అందులో 4,618 ఎకరాలు ఎండిపోయే పరిస్థితి ఏర్పడిందని మండల వ్యవసాయాధికారి బి.ధనుంజయ తెలిపారు. పరిస్థితిని ఇప్పటికే ఉన్నతాధికారుల దృష్టిలో పెట్టినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఏడీఏ కె.జగన్మోహనరావు, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు లడ్డుకేశవపాత్రో, పీఏఏలు పాల్గొన్నారు.



సమావేశంలో అధికారులు, నాయకులు

నియామక పత్రాలు అందజేత

సోంపేట: వలంటీర్లు సక్రమంగా విధులు నిర్వహించాలని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. మండలంలో నూతనంగా ఎంపికై న వలంటీర్లకు నియామక పత్రాలను శనివారం అందజేశారు. ప్రభుత్వ అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులందరికీ సక్రమంగా అందించాలన్నారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

వజ్రపుకొత్తూరు రూరల్: డోకులపాడులో చేపట్టనున్న పలు అభివృద్ధి పనులకు సర్పంచ్ వడ్డి సరిత, ఎంపీటీసీ సభ్యురాలు కొయిరి భాగ్యలక్ష్మి శనివారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో గ్రామ సచివాయ కన్వీనర్ వడ్డి కరుణాకర్, పార్టీ మండల అధ్యక్షుడు పుక్కళ్ల రామచంద్రుడు, మత్స్యకార అధ్యక్షుడు పాపారావు, ఢిల్లీరావు, కామరాజు, దేవమ్మ, సుందరమ్మ ఉన్నారు.

నరసింగపల్లి ఉప సర్పంచ్‌గా మధు



మధును అభినందిస్తున్న దువ్వాడ వాణి

టెక్కలి: నరసింగపల్లి పంచాయతీ ఉప సర్పంచ్‌గా జగన్నాథపురం గ్రామానికి చెందిన వార్డు సభ్యుడు జనా మధు ఎన్నికయ్యారు. సర్పంచ్ రౌతు జయమోహన్ ఆధ్వర్యంలో పంచాయతీకి చెందిన వార్డు సభ్యులు, నాయకులంతా శనివారం వైఎస్సార్‌సీపీ టెక్కలి నియోజకవర్గ సమన్వయకర్త దువ్వాడ వాణిని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వాణి మాట్లాడుతూ.. నరసింగపల్లి పంచాయతీలో వైఎస్సార్‌సీపీ మరింత బలోపేతం చేసే విధంగా కృషి చేయాలన్నారు. ఉప సర్పంచ్ మధును అభినందించారు.

గోరుముద్ద పరిశీలన

టెక్కలి రూరల్: విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మధ్యాహ్న భోజనం అమలులో లోపాలు లేకుండా చూడాలని ఎంఈవో దాసుపురం చిన్నారావు అన్నారు. నర్సింగపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలో అమలౌతున్న జగనన్న గోరుముద్ద పథకాన్ని శనివారం పరిశీలించారు. వంట కార్మికులు తయారు చేసిన ఆహారాన్ని రుచి చూశారు. మెనూను సక్రమంగా అమలు చేయాలన్నారు. అనంతరం నాడు-నేడు పథకంలో భాగంగా నిర్మాణం జరుగుతున్న భవనాల పనులను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయుడు ఎ.సోమేశ్వరరావు, ఉపాధ్యాయులు బి.ప్రమీల, చిన్నారావు, ధర్మారావు ఉన్నారు.

విద్యుత్ సబ్ స్టేషన్‌లో విజిలెన్స్ తనిఖీలు

టెక్కలి: రావివలస విద్యుత్ సబ్ స్టేషన్‌లో శనివారం విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేశారు. సబ్ స్టేషన్ పరిధిలో ఇటీవల పలు ఆరోపణలు రావడంతో, విశాఖకు చెందిన చీఫ్ విజిలెన్స్ అధికారి ప్రసన్నకుమార్ ఆదేశాలతో సీఐ వెంకునాయుడు తనిఖీలు చేశారు. అయితే జిల్లాకు చెందిన అధికారులు కాకుండా పక్క జిల్లాకు చెందిన విజిలెన్స్ అధికారులు తనిఖీలు చేయడం చర్చనీయాంశంగా మారింది.

సంక్షిప్తంగా...

కళ్లద్దాలు పంపిణీ

వజ్రపుకొత్తూరు రూరల్: గరుడబద్ర గ్రామ సచివాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమంలో అవ్వాతాతలకు ఉచితంగా కంటి అద్దాలను అందించారు. కార్యక్రమంలో పాల్గొన్న సర్పంచ్ గూడ గిరిజ మాట్లాడుతూ.. ప్రజల ఆరోగ్యానికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రక్షగా నిలుస్తున్నారన్నారు.

బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్ పోటీలకు ఆహ్వానం

కాశీబుగ్గ: పలాస-కాశీబుగ్గ బస్టాండ్ వద్ద డిసెంబర్ 17న 29వ సీనియర్ మిస్టర్ ఆంధ్రా బాడీబిల్డింగ్ చాంపియన్‌షిప్-2023 పోటీలు నిర్వహిస్తున్నట్లు ఆర్గనైజర్ నెయ్యిల భాస్కరరావు తెలిపారు. 55 కేజీల నుంచి 85 కేజీల మధ్య పలు విభాగాల్లో పోటీలు జరుగుతాయని పేర్కొన్నారు. ఇందులో రాణించిన వారిని 2024 జనవరిలో తమిళనాడులో జరిగే సౌతిండియా బాడీ బిల్డింగ్ పోటీలకు పంపిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 9676625594 నంబర్‌ను సంప్రదించాలని కోరారు.

కళాశాలకు క్రీడా కిట్లు అందజేత

టెక్కలి: టెక్కలి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులకు వైఎస్సార్‌సీపీ నాయకురాలు డాక్టర్ దువ్వాడ హైందవి, ఆమె భర్త మోహన్ శనివారం క్రీడా కిట్లు అందజేశారు. క్రికెట్, టెన్నిస్, వాలీబాల్‌తో పాటు మరికొన్ని క్రీడలకు సంబంధించిన కిట్లను ప్రిన్సిపాల్ గోవిందమ్మకు అందించారు. ఈ సందర్భంగా హైందవి మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాలలు, పాఠశాలల్లో క్రీడాకారులను గుర్తించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చర్యలు చేపడుతున్నారని, ఇందులో భాగంగా తమవంతు సాయంగా క్రీడా కిట్లు అందించామన్నారు.

సక్రమంగా ఆస్పత్రి నిర్వహణ

సోంపేట: ఆస్పత్రి నిర్వహణ సక్రమంగా ఉండాలని ఎంపీపీ నిమ్మన దాస్ అన్నారు. కొర్లాం ప్రాథమిక ఆరోగ్యం కేంద్రం అభివృద్ధి కమిటీ సమావేశం శనివారం జరిగింది. సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రికి కావలసిన పరికరాలు అవసరాన్ని బట్టి కొనుగోలు చేయాలన్నారు. వైద్యులు డాక్టర్ బి.సౌజన్య, వందిత, వైఎస్సార్‌సీపీ మండల కమిటీ అధ్యక్షుడు శిలగాన భాస్కరరావు, మర్ల శంకర్, తామాడ మోహన్, పాపారావు పాల్గొన్నారు.

ఆలయ నిర్మాణానికి రూ. 50 వేల విరాళం

టెక్కలి: రావివలస ఎండల మల్లికార్జునస్వామి ఆలయానికి ఎదురుగా అయ్యప్ప ఆలయ నిర్మాణానికి సంతబొమ్మాళి జెడ్పీటీసీ సభ్యుడు పాల వసంతరెడ్డి తనవంతు సాయంగా రూ. 50 వేలు విరాళాన్ని అందజేశారు. ఈ మేరకు శనివారం ఆలయం శ్లాబ్ పనులను శాస్త్రోక్తంగా ప్రారంభించారు.

జాతీయస్థాయి వాలీబాల్ పోటీలకు బొరివంక విద్యార్థి



సందీప్‌ను అభినందిస్తున్న హెచ్ఎం రామకృష్ణ

కవిటి: బొరివంక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన బల్ల సందీప్ జాతీయ స్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక కావడం తమకు గౌరవమని హెచ్ఎం సనపల రామకృష్ణ అన్నారు. ఈ మేరకు పాఠశాలలో సందీప్‌ను అభినందించారు. జాతీయ స్థాయిలోనూ పేరు ప్రఖ్యాతలు సాధించాలని ఆకాంక్షించారు. సందీప్‌కు సర్పంచ్ బెందాళం శ్రీరాంప్రసాద్, ఎంపీటీసీ సభ్యుడు దుద్ది సతీష్, ఎన్ఆర్ఐ ఆనంద్‌రావ్‌లు అభినందనలు తెలిపారు.

ఆదిత్య కళాశాలలో రక్త గ్రూప్ పరీక్షలు

టెక్కలి: జిల్లా రెడ్‌క్రాస్ నేతృత్వంలో ఆదిత్య ఇంజినీరింగ్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ విభాగం సంయుక్తంగా వన్ మిలియన్ బ్లడ్ గ్రూప్ పరీక్షలు నిర్వహించారు. విద్యార్థులకు రక్త పరీక్షలు చేశారు. యోగాపై తదితర అంశాలపై అవగాహన కల్పించినట్లు కళాశాల డైరెక్టర్ వి.వి.నాగేశ్వరరావు వెల్లడించారు. మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్ డి.సంజీవరావు, ఎస్ఐ రామకృష్ణ, రెడ్ క్రాస్ ప్రతినిధి పి.చైతన్య, ప్రిన్సిపాల్ ఎ.ఎస్.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

సహకార రంగం బలోపేతం



మాట్లాడుతున్న నరేంద్ర యాదవ్

ఇచ్ఛాపురం రూరల్: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకార రంగాన్ని బలోపేతం చేశారని ఇచ్ఛాపురం పీఏసీఎస్ అధ్యక్షుడు నర్తు నరేంద్రయాదవ్ అన్నారు. ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం కార్యాలయం వద్ద శనివారం 70వ అఖిల భారత సహకార వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సహకార వ్యవస్థను 2003లో చంద్రబాబు అమ్మకానికి పెడితే, వైఎస్ రాజశేఖరరెడ్డి మరల సహకార వ్యవస్థను పునరుద్ధించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో డీసీసీబీ సీఈవో డి.వరప్రసాద్, టెక్కలి డీఎల్‌సీఓ కె.మురళీకృష్ణమూర్తి, ఎంపీపీ బోర పుష్ప, మున్సిపాలిటీ చైర్‌పర్సన్ పిలక రాజలక్ష్మి, జెట్పీటీసీ సభ్యురాలు ఉప్పాడ నారాయణమ్మ, డీసీఎంఎస్ మాజీ చైర్‌పర్సన్ సల్ల సుగుణ, పీఏసీఎస్ అధ్యక్షుడు ఎన్.బాబూరావు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ భారతీ దివ్య, వైస్ ఎంపీపీ దువ్వు వివేకానందరెడ్డి, ఎస్సీసెల్ రాష్ట్ర కార్యదర్శి సల్ల దేవరాజు, పీఏసీఎస్ డివిజన్ స్థాయి అధికారులు ఎల్.పాపారావు, పి.వెంకటరమణ, ఎస్.హరినాథరావు, సీఈవో బి.భుజంగరావు, డీసీసీబీ బీఎం ఎ.తులసీబాయి, సూపర్‌వైజర్ మోహనరావు పురియా, పలువురు సర్పంచ్‌లు, ఎంపీటీసీ సభ్యులు, బ్యాంకు సిబ్బంది పాల్గొన్నారు.

మంత్రికి నర్సిపురం గ్రామస్తుల కృతజ్ఞతలు



మంత్రి అప్పలరాజును సత్కరిస్తున్న గ్రామస్తులు

కాశీబుగ్గ: మున్సిపాలిటీ పరిధి ఎనిమిదో వార్డు నర్సిపురం గ్రామస్తులు మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు. పలాస రైల్వేస్టేషన్ పక్కనే ఉన్న నర్సిపురం గ్రామానికి రైల్వేస్టేషన్ మీదుగా ఫుట్‌పాత్ ఫ్లైఓవర్ బ్రిడ్జిని ఏర్పాటు చేస్తుండటంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఫుట్‌పాత్ బ్రిడ్జి పనులు సాంకేతిక కారణాలతో రైల్వే సిబ్బంది కట్టడి చేశారు. దీంతో నర్సిపురం ప్రజల ఇబ్బందులపై మంత్రి స్పందించి రైల్వే ఉన్నత అధికారులతో మాట్లాడారు. ప్రజలు పడుతున్న ఇబ్బందులు తెలియజేశారు. ప్రస్తుతం పలాస రైల్వేస్టేషన్ మీదుగా నడకదారికి బ్రిడ్జి నిర్మాణ పనులు ప్రారంభించారు. దీంతో గ్రామస్తులు మంత్రిని శనివారం కలిసి కృతజ్ఞతలు తెలియజేసి సన్మానించారు.

బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పలాస విద్యార్థుల ప్రతిభ



బహుమతులు పొందించిన విద్యార్థులు

కాశీబుగ్గ: టెక్కలి ఆర్‌సీఎం పాఠశాలలో జరిగిన జిల్లాస్థాయి 31వ జాతీయ బాలల సైన్స్ కాంగ్రెస్ పోటీల్లో పర్యావరణ వ్యవస్థ ఆరోగ్యం కోసం సామాజిక సాంస్కృతిక పద్ధతులు అనే విభాగంలో పలాస ఉన్నత పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబర్చి ప్రథమ స్థానాన్ని దక్కించుకున్నారు. ఈ నెల 29, 30 తేదీల్లో రాష్ట్ర స్థాయిలో జరగబోయే పోటీలకు విద్యార్థులు డి.యుగంధర్, డి.రాకేష్ గైడ్ టీచర్ జె.షణ్ముఖరావు ఎంపికయ్యారు. వీరికి ప్రధానోపాధ్యాయుపు డి.దాశరథి, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు అభినందించారు.

ఇచ్ఛాపురం నియోజకవర్గాన్ని కరువు ప్రాంతంగా ప్రకటించాలి



కలెక్టర్ శ్రీకేష్ బి.లాఠకర్‌తో మాట్లాడుతున్న జెడ్పీ చైర్‌పర్సన్ విజయ, సమన్వయకర్త సాయిరాజ్

కంచిలి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలోని నాలుగు మండలాలను కరువు ప్రాంతాలుగా గుర్తించాలని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, నియోజకవర్గ వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త సాయిరాజ్ కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ శ్రీకేష్ బి. లాఠకర్‌ను శనివారం తన చాంబర్‌లో కలిసి విన్నవించారు. సోంపేట మండలం పైడిగాం ఆయకట్టు చానల్‌కి రీ లొకేషన్ లెద్దగుడ్డి వద్ద నిర్మాణానికి ఇరిగేషన్ శాఖ అధికారులను కోరి.. ప్రభుత్వానికి రిపోర్ట్ సబ్మిట్ చేసేలా ఆదేశించాలని కోరారు. అదేవిధంగా ఇచ్ఛాపురం బాహుదా బ్రిడ్జి నిర్మాణానికి రూ. 20 కోట్లతో మంజూరైన పనులకు సాంకేతిక అనుమతులు త్వరితగతిన ఇచ్చి టెండర్ ప్రక్రియ పూర్తిచేసి బ్రిడ్జి నిర్మాణానికి చర్యలు చేపట్టాలని, కవిటి మండలం భైరిపురం గ్రామంలోని 70 మంది రైతులకు సంబంధించి గత 50 సంవత్సరాల నుంచి వారి హక్కులు, అనుభవంలో ఉన్న భూములకు రీ సర్వే ద్వారా వారికి పాస్‌బుక్‌లు ఇచ్చేలా చర్యలు చేపట్టాలని కలెక్టర్‌ను కోరారు.

రైతు సంక్షేమానికి పెద్దపీట



విత్తనాలు పంపిణీ చేస్తున్న తిలక్

నందిగాం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేస్తున్నారని రాష్ట్ర కాళింగ కార్పొరేషన చైర్మన్ పేరాడ తిలక్ అన్నారు. నందిగాం పంచాయతీ పెంటూరులో రైతులకు రాయితీపై వేరుశనగ విత్తనాలను శనివారం పంపిణీ చేశారు. రైతులకు పూర్తి స్థాయిలో సేవలు అందజేయాలనే లక్ష్యంతో రైతు భరోసా కేంద్రాలను ఏర్పాటు చేశారన్నారు. రైతులకు మేలు చేస్తున్న సీఎం జగన్‌కు అండగా ఉండాలని కోరారు. వ్యవసాయాధికారి శ్రీకాంత్ వర్మ, ఎంపీపీ నడుపూరు శ్రీరామమూర్తి, జేసీఎస్ మండల ఇన్‌చార్జి జద్యాడ జయరాం, మండల వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు నందిగాం శ్యామసుందరరావు, అంబోడి విష్ణు, చిన్ని జోగారావు, ప్రధాన రాజేంద్ర,పిన్నింటి అజిత్‌కుమార్, బలిడే గోవిందరావు, బెండి బాబూరావు పాల్గొన్నారు.

మందసలో కరువు పరిస్థితులు

- మండల సమావేశంలో వ్యవసాయశాఖ స్పష్టీకరణ



మాట్లాడుతున్న ఎంపీపీ దానయ్య

మందస: వర్షాభావ పరిస్థితులతో మందస మండలంలో కరువు పరిస్థితులు ఏర్పడ్డాయని వ్యవసాయాధికారి జి.నాగరాజు చెప్పారు. మండల సమావేశం ఎంపీపీ డొక్కరి దానయ్య అధ్యక్షతన శనివారం జరిగింది. సభ్యులు అడిగిన ప్రశ్నలకు ఏవో సమాధానమిస్తూ.. ఖరీఫ్ సీజన్‌లో వర్షాలేకపోవడంతో దమ్ములు ఆలస్యమయ్యాయన్నారు. వరి పంటపై సర్వే చేశామని, 682.37 హెక్టార్లలో పంటకు నష్టం జరిగిందన్నారు. గ్రామాల్లో సర్వే నిర్వహించి, గుర్తించడం జరిగిందన్నారు. సాగునీటి వనరులు నిరుపయోగంగా మారడంతో పంటలు పండే పరిస్థితిలేకపోవడంతో నివేదికలను ప్రభుత్వానికి సమర్పించామన్నారు. రివైజ్డ్ నివేదికల్లో 32 గ్రామాల్లో కరువు గుర్తించామన్నారు. నోటిఫైడ్ ప్రాంతాలకు మాత్రమే జొన్నలు, మొక్కజొన్న విత్తనాలు సరఫరా ఉంటుందన్నారు సభ్యులు మాట్లాడుతూ కరువు మండలంగా మందసను ప్రకటించాలన్నారు. వైద్యాధికారి డాక్టర్ మద్దిల సంపత్‌రావు మాట్లాడుతూ.. పీహెచ్‌సీకి సంతోషిణిని వైద్యాధికారిగా నియామకం జరిగిందన్నారు. కుసుమలలో చెడిపోయిన కోడిగ్రుడ్లను పంపిణీ చేస్తున్నారని సర్పంచ్ సవర సుధాకర్ ఆరోపించగా, దర్యాప్తు చేస్తామని సూపర్‌వైజర్ మంగమ్మ చెప్పారు. పండ్ల తోటల పెంపకానికి ప్రాధాన్యత ఇస్తున్నట్టు ఉపాధి ఏపీఓ బీవీ హరికృష్ణ చెప్పారు.